# దూసుకుపోతున్న మెట్రో

- రికార్డుస్థాయిలో ప్రయాణికులు
- కారిడార్లలో క్రమేపీ పెరుగుతున్న రద్దీ
- ఒక్క ఎల్బీనగర్‌లోనే రోజుకు 50 వేల మంది



అమీర్‌పేట్ మెట్రోస్టేషన్‌లో గ్రీన్‌మైల్ రాయల్టీ క్లబ్‌ను ప్రారంభిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): అనతికాలంలోనే మెట్రోరైలు అమిత ప్రజాదరణ పొందింది. ట్రాఫిక్, కాలుష్య రహితమైన ప్రయాణాన్ని అందిస్తూ విభిన్నవర్గాలకు చేరువైంది. మెరుగైన రవాణాను అందిస్తోంది. తొలిరోజుల్లో నగటున 1.60 లక్షల నుంచి 2.10 లక్షల మంది రాకపోకలు సాగించగా, ప్రస్తుతం 4.80 లక్షల నుంచి 5.10 లక్షల వరకు ప్రయాణిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో సుమారు రూ.14,132 వేల కోట్ల వ్యయంతో మెట్రో ప్రాజెక్టును ప్రారంభించారు. 2017 నవంబర్ నుంచి ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం కారిడార్ల పరిధిలోని 69.2 కిలోమీటర్ల మార్గంలో రైళ్లు నడుస్తున్నాయి. ఆరంభంలో హైదరాబాద్ మెట్రోరైలు అధికారులు అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్అండ్‌టీ అధికారులు తీవ్రంగా కృషి చేసి ఆయా కారిడార్లలో పిల్లర్ల నిర్మాణానికి కావాల్సిన ఆస్తుల సేకరణకు పకడ్బందీగా చేశారు. సమర్థవంతంగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి వచ్చారు.

### రోజురోజుకూ ఆదరణ

మెట్రోరైళ్లకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఉదయం 6 గంటలకు

మిగతా 6వ పేజీలో..

## 'కోడ్' ముగిశాక మెట్రో రెండో దశ డీపీఆర్

### ఈ నెల 2 వరకు 54 కోట్ల మంది ప్రయాణాలు : ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మెట్రో రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు ప్రారంభమైన 2017 నవంబర్ 28 నుంచి ఈనెల 2 వరకు 54 కోట్ల మంది ప్రయాణించారని, తద్వారా వివిధ వాహనాల్లో 14.05 కోట్ల లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను ఆదా చేశామని చెప్పారు. గత ఫిబ్రవరి 2 వరకు 50 కోట్ల మంది ప్రయాణికుల మైలురాయి చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ఉత్సవాలు నిర్వహించారు. తరచుగా మెట్రోలో ప్రయాణించే వారికి ప్రోత్సాహకాలు అందించేందుకు ఆ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'గ్రీన్ మైల్ రాయల్టీ క్లబ్‌ను ఎన్వీఎస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రైవేట్-పబ్లిక్ భాగస్వామ్యంతో నడిచే ఏకైక మెట్రో రైలు హైదరాబాద్‌లో మాత్రమే ఉందన్నారు. హైదరాబాద్‌లో అన్ని ప్రాంతాలను కలుపుతూ మెట్రోను నడపాలని సీఎం సూచించారని, ఆ మేరకు మెట్రోను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# దూసుకుపోతున్న మెట్రో

(5వ పేజీ తరువాయి)

ప్రారంభమవుతున్న రైళ్లు రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా నడుస్తూ అన్ని వర్గాల ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ప్రతి 3 నుంచి 6 నిమిషాలకోసారి రైలు వస్తుండడంతో ప్రయాణికులు పెద్ద ఎత్తున వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. కొవిడ్ కాలంలో ప్రయాణికుల సంఖ్య కొంతమేరకు తగ్గినా మళ్లీ పుంజుకుంది.

కారిడార్-1లోని ఎల్బీనగర్‌లో రోజుకు 40 నుంచి 50 వేల మంది, కారిడార్ 3లోని రాయదుర్గంలో 35 నుంచి 40 వేల మంది ప్రయాణిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కారిడార్-2 జేబీఎస్-ఎంజీబీ ఎస్‌లో తక్కువ మొత్తంలో ఉంటున్నారని, ఈ మార్గంలో రోజులో గరిష్ఠంగా 25 వేలు దాటడంలేదని పేర్కొంటున్నారు. వచ్చే మూడేళ్లలో 80 కోట్ల మందికి చేరేందుకు ప్రయత్నిస్తామని అధికారులు చెబుతున్నారు.

**మెట్రో రైళ్లలో ప్రయాణికులు**

| సంవత్సరం | సంఖ్య |
|---|---|
| 2017 | 34.05 లక్షలు |
| 2018 | 3.44 కోట్లు |
| 2019 | 9.02 కోట్లు |
| 2020 | 3.04 కోట్లు (కొవిడ్ కాలం) |
| 2021 | 5.01 కోట్లు(కొవిడ్ కాలం) |
| 2022 | 11.02 కోట్లు |
| 2023 | 15.80 కోట్లు |
| 2024 | ఫిబ్రవరి 2 వరకు మొత్తం 50.00 కోట్లు |
| 2024 | ఫిబ్రవరి 3 నుంచి మే 2 వరకు 5.04 కోట్లు |